

## నీటి సమస్యకు పరిష్కారం

**జుక్కల్, ఫిబ్రవరి 24**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు నూతన బోరు మోటారు ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ జాదవ్ శాంతా బాయి నౌష నాయక్ తెలిపారు. కౌన్సిలర్ నివాస సమీపంలో నూతన బోరు మోటారు పనులు పూర్తి చేసి 6వ వార్డు ప్రజలకు తిరిగి తాగునీటి సరఫరా ప్రారంభించినట్లు వెల్లడించారు. దీంతో కొంతకాలంగా ఎదురవుతున్న నీటి సమస్యకు ఉపశమనం లభించిందని వార్డు ప్రజలు అభిప్రాయ పడ్డారు. ఈ కార్యక్రమంలో జాదవ్ నౌష నాయక్, జాదవ్ పండరి నాయక్, బొగడిమీది శంకర్, పవార్ ప్రతాప్, మక్కయి సాయిలు, డా. లక్ష్మణ్, గైని శంకర్, బొగడిమీది బాలన్న, అనిల్, బస్వంత్, మున్సిపల్ వాటర్‌మ్యాన్ ర్యాకల సాయన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలి

**మెట్ పల్లి టౌన్ ,ఫిబ్రవరి24 :**



విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అల్ ది బెస్ట్ తెలిపారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా,ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరై తమ ప్రతిభను చాటాలని సూచించారు.పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు ఒక ముఖ్యమైన దశ అని పేర్కొ న్నారు. క్రమశిక్షణ, సమయపాలనతో పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలని సూచించారు .హాల్ టికెట్ వెంట తీసుకెళ్లాలని తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి వత్తిడికి గురికావొద్దని, తల్లిదండ్రులు విద్యార్థులకు మానసిక ధైర్యం కల్పించి, ఒత్తిడి లేకుండా పరీక్షలకు పంపాలని సూచించారు. విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించి మన జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.



## ఇందిరమ్మ ఇండ్లతో పేదింటి వారి కల నెరవేరుతోంది

**జుక్కల్, ఫిబ్రవరి 24 :**

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మున్సిపాలిటీ పట్టణంలోని ఆరవ వార్డులో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఆదేశాల మేరకు నూతనంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం కౌన్సిలర్లు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఇళ్ల మంజూరుతో లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు ముజీబ్, నౌషా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సముచితంగా సంక్షేమ పథకాల లబ్ధి అందుతుందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఇండ్లు ఇవ్వకుండా సామాన్య ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ పథకం ద్వారా గ్రామగ్రామాన పేదలకు ఇళ్లు మంజూరు చేసి కలను నెరవేర్చడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన డీఎంహెచ్ఓ రవీందర్ గౌడ్

**కామారెడ్డి, ఫిబ్రవరి 24 :**

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)గా రవీందర్ గౌడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సదుపాయాలను మెరుగుపరచడం, తల్లి–శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.

# పౌష్టికాహారం ఎక్కడ? మెనూ చార్టులకే పరిమితమా?

- **విద్యార్థినుల తల్లిదండ్రుల ఆవేదన**

**ఇందల్వాయి, ఫిబ్రవరి 24 :**





మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు అందించాల్సిన టిఫిన్, మధ్యాహ్న భోజనం నాణ్యత నానాటికి దిగజారుతోందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందడం లేదని ఆరోపించారు. నాణ్యమైన ఆహారం అందించాల్సిన ఏజెన్సీలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూరల్లో నాణ్యత లేదని, వారానికి ఇవ్వాల్సిన గుడ్లు, పప్పు తదితర పౌష్టికాహార పదార్థాలు క్రమంగా అందడం లేదని తెలిపారు. సరైన సమయానికి టిఫిన్, భోజనం వండించకపోవడంతో విద్యార్థినులు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యంతో చెలగాటం ఆడడం నిబంధనలకు విరుద్ధమని, అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. స్థానిక విద్యాశాఖ అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రిన్సిపల్ విద్యార్థినుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. వంట ఏజెన్సీ సిబ్బంది లీవ్‌లో ఉండటంతో ఆలస్యంగా భోజనం అందించాల్సి వచ్చిందని ప్రిన్సిపల్ సమాధానం ఇచ్చారని తెలిపారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం సరైన సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చూపిన ఏజెన్సీలపై చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

## ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- **ఎకరాకు 20 వేల నష్టపరిహారం ఇవ్వాలి**
- **మాజీ మంత్రి జీవన్ రెడ్డి**

**రాయికల్, ఫిబ్రవరి 24 :**



ప్రకృతి వైపరీత్యంతో అకాల వర్షాలు, ఈదురు గాలులకు పంటలు నష్టపోయిన మొక్కజొన్న, మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఈదురు గాలులు, అకాల వర్షంతో నేలకొరిగిన మొక్కజొన్న, మామిడి పంటలను రాయికల్ మండలం రామజిపేట్ గ్రామంలో మంగళవారం రైతులతో కలిసి పరిశీలించారు. పంట నష్టాన్ని కలెక్టర్, వ్యవసాయ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని అన్నారు. రాయికల్ పట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పంట నష్టం భీమా పథకం అమలు లేనందున ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఎకరాకు 20 వేల రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయ అంశమేనని, రైతాంగానికి మేలు చేసే రైతు భరోసా నిధులను ఫిబ్రవరి చివర్లో విడుదల చేసి రైతులకు అండగా నిలవాలని సూచించారు. రైతు బిడ్డగా ముఖ్యమంత్రి రైతుల పక్షాన నిలిచి దేశానికి అన్నం పెట్టే రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, నాయకులు తంగేళ్ల రమేష్, ఎద్దండి భూమారెడ్డి, కొయ్యేడి మహిపాల్, దాసరి గంగాధర్, కడకుంట్ల నరేష్, మున్ను, ఎద్దండి లింగారెడ్డి, బాపురపు నర్సయ్య, కొమ్ముల ఆదిరెడ్డి, బత్తిని భూమయ్య, షాకీర్, మంద రమేష్, నాగరాజు, రాజీవ్, శివ, రాజారెడ్డి, హరీష్, సుదీర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ

**చేగుంట, ఫిబ్రవరి 24 :**

మెదక్ జిల్లా చేగుంట మండలం చందాయపేట గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 85 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లను మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని విద్యార్థులకు ప్రతి ఏడాది తన వంతుగా ఎగ్జామ్ ప్యాడ్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు రూ.2,000 నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించేందుకు చిన్న ప్రోత్సాహంగా ఈ సహాయం చేస్తున్నామని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు విట్టల్ రెడ్డి, నర్సింలు, దామోదర్, గిరిధర్, శ్రీనివాస్, శంకర్, సలీం, రాములు, స్వప్న, సౌజన్య, వీణ, సంతోషిమాత, లక్ష్మణ్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం

**ఇందల్వాయి, ఫిబ్రవరి 24 (ప్రజా శంఖారావం):**



మండలంలోని మల్లాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అర్చక బృందం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య సీతా సమేత లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని భక్తుల జయజయధ్వనాల నడుమ నిర్వహించారు. ఈ ఘట్టాన్ని వీక్షించేందుకు మల్లాపూర్ గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగింది. కల్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామ కమిటీ సభ్యులు, దాతల సహకారంతో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దర్శనం మోహన్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పాల్గొన్నారు.





## రఘుపతి రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**చేగుంట, ఫిబ్రవరి 24 :**

మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్, ఇబ్రహీంపూర్ సొసైటీ మాజీ చైర్మన్ చేర్యాల రఘుపతి రెడ్డి ఇటీవల మృతి చెందడంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. రఘుపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో నిజాయితీగా, హుందాగా వ్యవహరించిన రఘుపతి రెడ్డి వంటి నాయకుడిని కోల్పోవడం తీరని లోటని అన్నారు. ప్రజలతో సన్నిహితంగా ఉంటూ ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. మృతుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మెదక్ జిల్లా రైతు బంధు మాజీ డైరెక్టర్ చేర్యాల మోహన్ రెడ్డికి మామయ్య అని తెలిపారు. రఘుపతి రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



## మాజీ ఎంపీపీ కుటుంబానికి పరామర్శ

**చేగుంట/నార్సింగి ఫిబ్రవరి 24 :**

మెదక్ జిల్లా, నార్సింగి మండలం వల్లూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకురాలు, మాజీ ఎంపీపీ చిందం సబిత భర్త రవీందర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించగా, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ విషాద ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు, ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ మరియు తాను ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి ఈ అపార నష్టాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు , కార్యకర్తలు ఉన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

**చేగుంట, ఫిబ్రవరి 24 :**



మెదక్ జిల్లా, చేగుంట మండలం, ఈరోజు నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా దుబ్బాక నియోజకవర్గంలోని విద్యార్థినీ విద్యార్థుల కు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హృదయపూర్వక శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితంలో ఒక కీలకమైన మలుపు అని, ఏడాది పొడవునా కష్టపడి చదివిన పాఠాలను ఆందోళన చెందకుండా ధైర్యంగా మరియు ఆత్మ విశ్వాసంతో రాయాలని సూచించారు, పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉంటూ ప్రతి ప్రశ్నకు సమగ్రంగా సమాధా నాలు ఇచ్చి మంచి ఫలితాలు సాధించాలని, ఆ విజయంతో మీ తల్లిదండ్రులకు మరియు గురువులకు గర్వకారణం కావాలని ఆకాంక్షించారు. పట్టుదలతో ముందుకు సాగితే విజయం మీ సొంతమవుతుందని పేర్కొంటూ నియోజక వర్గంలోని ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలని కోరారు.

